క్లుప్తంగా

ఉత్తమ రైతుగా మద్దుకూరి కృష్ణ



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న మద్దుకూరి కృష్ణ

కొయ్యలగూడెం: ఉత్తమ రైతు పురస్కారాన్ని కన్నాయిగూడెం గ్రామానికి చెందిన మద్దుకూరి కృష్ణ అందుకున్నారని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు సోమవారం తెలిపారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా కృష్ణ ప్రశంసా పత్రాన్ని మొమెంటోను అందుకున్నట్లు తెలిపారు.

115 మందికి వైద్య పరీక్షలు



పోలవరంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం

పోలవరం రూరల్: పోలవరం ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద మండల పెన్షనర్స్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 115 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి, దంత, జనరల్ వ్యాధులకు సంబంధించి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కళ్లజోళ్లను అందించారు. మానవత సంస్థ, పెన్షనర్స్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాత సుబ్బారావుకు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన వై.సుబ్బారావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



దినేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొల్లూరి దినేష్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. ఇటీవల దినేష్ తండ్రి రాధాకృష్ణ గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలుసుకున్న తెల్లం బాలరాజు దినేష్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధైర్యపడవద్దని దినేష్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో నూకాలమ్మ తల్లి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ నూకాలమ్మ ఆలయ వార్షిక ఉగాది జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో కొలువైయున్న శ్రీ నర్మదా బాణ లింగేశ్వరస్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సాందీపని విద్యా కేంద్రం చిన్నారులు భగవద్గీత పారాయణం చేశారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ(పండు) తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఆనందోత్సాహాల నడుమ పండుగ జరుపుకున్న ముస్లింలు
- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు



జంగారెడ్డిగూడెం: బైనేరు వద్ద ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు



కొయ్యలగూడెం: కన్నాపురంలో పాయసం పంపిణీ చేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

జంగారెడ్డిగూడెం: రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. బిలాల్ మసీద్‌తో పాటు పట్టణంలో ఉన్న మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజులు నిర్వహించారు. బిలాల్ మసీదు మత గురువు అతిక్ కాశ్మీ ఆధ్వర్యంలో స్థానిక బైనేరు కాలువ వద్ద ఉన్న ఈద్గాలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ర్యాలీగా జంగారెడ్డిగూడెంలోని బిలాల్ మసీదు వద్దకు చేరుకున్నారు. మత గురువు అతిక్ కాశ్మీ రంజాన్ విశిష్ఠతను వివరించి, ముస్లింలు ఆచరించాల్సిన విషయాలను వివరించారు. బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ యాకుబ్, షేక్ ముస్తఫా, షేక్ బాజీ, టిప్ టాప్ షేక్ అక్బర్, ఎండీ రఫీ అల్లావుద్దీన్, సయ్యద్ షేక్ అమీర్, బషీరుద్దీన్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక

లక్కవరం ఫారూఖీ మసీదు నందు కమిటీ అధ్యక్షుడు పఠాన్.అన్వర్ బాషా ఆధ్వర్యంలో ఇమామ్ ఎండీ. బాబర్ అలీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్వర్ బాషా మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. మహమ్మద్ ప్రవక్త ఉపదేశించినట్టు ఇతర మతాలవారి మనోభావాలు నొప్పించకుండా వారిని గౌరవిస్తూ సోదర భావంతో మెలగాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు పకీర్ షా, ప్రధాన కార్యదర్శి ఇమామ్, కార్యదర్శి ఎండీ. లాల్సా, వార్డు సభ్యులు సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

కొయ్యలగూడెం: ముస్లిం సోదరులు సోమవారం భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కొయ్యలగూడెం, కన్నాపురం, దిప్పకాయలపాడు, యర్రంపేట, రాజవరం, బయ్యన్నగూడెం, వేదాంతపురం గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లోని ఇమామ్‌లు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. ముస్లింలు కన్నాపురంలో మెయిన్ రోడ్డులో ఉన్న దుకాణదారులకు మతసామరస్యాన్ని నింపుతూ పాయసాన్ని పంపిణీ చేశారు. ఈద్గాల వద్ద పూర్వీకుల ఆత్మశాంతికై ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పండుగను బయ్యనగూడెం గ్రామ ముస్లిం సోదరులు స్థానిక ఈద్గా నందు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల కమిటీ అధ్యక్షులు, సభ్యులు పఠాన్ మహబూబ్ జానీ, షేక్ షియాత్, షేక్ సయ్యద్ బాజీ. షేక్ లతీఫ్, పఠాన్ షరీఫ్, సయ్యద్ రసూల్, ఎస్ఎం అలీ, సయ్యద్ అహ్మద్, పఠాన్, రియాజ్ ఖాన్, షేక్ జహంగీర్, సయ్యద్ రంజని, షేక్ గాలిబ్ పాల్గొన్నారు.

టి.నరసాపురం: టి.నరసాపురంలో ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈద్–ఉల్–ఫితర్ రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున ముస్లింలు స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఇస్లాం మత ప్రబోధకులు ముంతాజ్ అన్సారీ, హాఫీజ్ నదీమ్ రంజాన్ పండుగ ప్రత్యేకతను ముస్లింలకు వివరించారు. అనంతరం స్థానిక ఖబరస్తాన్ చేరుకుని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మత పెద్దలు షేక్ అబ్బాస్, షేక్ షరీఫ్, సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా, మస్తాన్, షేక్ అబూబకర్, షేక్ లాలు, సయ్యద్ మీర్ సాహెబ్ (గులాబీ), ఖాదర్, సయీద్, షేక్ కరీముల్లా, ఉస్మాన్ సాహెబ్, నవాబ్, షమ్మీకపూర్, షేక్ వజీర్, షేక్ యాసిన్, సయ్యద్ అమానుల్లా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ద్వారకాతిరుమల: పలు గ్రామాల్లో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముస్లీంలతో దేవినేనివారిగూడెం, తిరుమలంపాలెం, తిమ్మాపురం, పంగిడిగూడెం, ఐఎస్ రామానుజాపురం, దొరసానిపాడు గ్రామాల్లోని ఈద్గా స్థలాలు కళకళలాడాయి. ముస్లిం సోదరులు, మహిళలు ఈద్గా స్థలాల్లో వేరువేరుగా నమాజులు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దాంతో ఈద్గా ప్రాంతాలు సందడిగా మారాయి.

కుక్కునూరు: కుక్కునూరులో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు, సోదరీమణులు, పిల్లలు, పెద్దలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పలువురు పేదలకు ఆర్థిక సహాయం చేశారు. నెల రోజుల ఉపవాసదీక్ష అనంతరం మొదలయ్యే షవ్వాల్ నెల ఆరంభమైన మొదటి రోజున జరుపుకునే పండుగే ఈద్ ఉల్ ఫితర్ అని నమాజ్ చదివించిన ఇమామ్‌లు తారిక్ అన్వర్, నయీమ్ తెలిపారు. మదీనా మస్జిద్ ప్రెసిడెంట్ షేక్ చాంద్‌పాషా, వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాబా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: పోలవరంలోని అహలే సున్నత్ జమాత్ ఆధ్వర్యంలో ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ముగించుకుని సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈద్గా వద్ద ప్రత్యేక నమాజు నిర్వహించారు. అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మన్యంలో రంజాన్ వేడుకలు

బుట్టాయగూడెం: మన్యంలో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బుట్టాయగూడెం, రామన్నగూడెం, పులిరామన్నగూడెం, రెడ్డిగణపవరం, దొరమామిడి గ్రామాల్లో మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరికీ ఈద్ ముబారక్ తెలుపుతూ సందడి చేశారు.

చింతలపూడిలో సామూహిక ప్రార్థనలు

చింతలపూడి,: మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చింతలపూడి, రాఘవాపురం, ప్రగడవరం, సీతానగరం గ్రామాల్లో రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గత నెల రోజులుగా కఠిన ఉపవాస దీక్షలతో రంజాన్ మాసంలో గడిపిన ముస్లింలు ఆదివారం ఉపవాస దీక్షలను విరమించారు. స్థానిక ఈద్‌గాహ్‌లో పేష్ యిమామ్ ఎండీ అబ్దుల్ వదూద్ ముస్లిం సోదరులతో సామూహిక ప్రార్థనలు జరిపించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకర్ని ఒకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా చింతలపూడిలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి రంజాన్ ప్రార్థనలకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని జామియా మస్జిద్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రహీం(బాబు), ఎండీ జిలానీలు ఈ సందర్భంగా ప్రార్థనల అనంతరం జరిగిన కార్యక్రమంలో డిమాండ్ చేశారు.



చింతలపూడి: ఈద్‌గాహ్‌లో ముస్లింల సామూహిక ప్రార్థనలు



టి.నరసాపురం: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో నమాజులు చేస్తున్న ముస్లింలు



కుక్కునూరు: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పోలవరం రూరల్: ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

పాశుపత సహిత భువనేశ్వరి యాగం ప్రారంభం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర పాశుపత సహిత భువనేశ్వరి యాగం సోమవారం ప్రారంభమైంది. బ్రహ్మశ్రీ మేడూరి రవితేజ పర్యవేక్షణలో శిష్య బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3వ తేదీ వరకు యాగ నిర్వహణ ఉంటుందని ధర్మకర్త బాలం దత్తుడు తెలిపారు. అదేవిధంగా కొయ్యలగూడెంలోని గొలగమూడి వెంకయ్య అవధూత స్వామి ధునిలో యాగం నిర్వహించారు. పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల మధ్య ఉన్న శ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయం, బయ్యన్నగూడెం రామ కోనేరు గట్టుపై ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.



కొయ్యలగూడెం వెంకయ్య స్వామి అవధూత ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన ఉగాది మహోత్సవాలు

కొయ్యలగూడెం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని టెంపుల్స్ సెంటర్స్‌లో ఉన్న ఆలయాల్లో నిర్వహించిన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొలుసు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. గ్రామ పురోహితులు, బ్రహ్మశ్రీ అని పెద్ది వెంకట నరసింహ శర్మను, అలాగే ఆలయంలో సకల దేవతా పారాయణలు నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను నింపుతున్న 60 మందికి పైగా మహిళలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. మొమెంటోలు అందజేసి పండితులచే వేద ఆశీర్వచనాలు అందజేశారు. అదేవిధంగా ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సేవా సంఘ సభ్యులు రూ.25 వేల విలువైన పంచాంగం, క్యాలెండర్, గంటల పంచాంగాలను 150 మంది పండితులకు, భక్తులకు ఉచితంగా అందించారు.



ఆలయంలో సత్కారం అందుకున్న పండితులు, పారాయణ భక్తులు

మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే

బుట్టాయగూడెం: మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వి. పెద్దిరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల శివారు గ్రామమైన రామనర్సాపురంలో ఒక మలేరియా కేసు నమోదైందని చెప్పారు. దీనితో ఆ గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేసినట్లు చెప్పారు. అలాగే మలేరియా నమోదైన ఇంటి నుంచి 50 ఇళ్ల వరకూ మలాథియాన్ స్ప్రేయింగ్ పనులతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే దోమ కాటు నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా దోమతెరలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ పందిరి శ్రీను, ఎన్. శ్రీను, ఎంపీహెచ్ఏ బాలాజీ, రమేష్, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, కుమారి, తదితరులు పాల్గొన్నారు.



రామనర్సాపురంలో జ్వరాల నివారణకు రక్తపూతలు సేకరిస్తున్న దృశ్యం

శ్రీపాటిమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: నియోజకవర్గంలో సంతాన లక్ష్మిగా పేరుపొందిన పెరుగుగూడెం గ్రామ దేవత శ్రీ పాటిమ్మ పేరంటాలమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెరుగుగూడెం, చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెం గ్రామాల మధ్య వెలసిన అమ్మవారి ఉత్సవాలను ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాస్ ప్రారంభించారు. అమ్మవారు యలమర్తి వారి ఆడపడుచు కావడంతో పెరుగుగూడెం గ్రామం నుంచి 108 మంది ముత్తయిదువులు కళశాలతో పాటిమ్మ తల్లి ఆలయం వద్దకు గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం శ్రీపాటిమ్మ తల్లికి జలాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ శ్రీనివాస్, హేమలత దంపతులు, పావులూరి దశరథ రామయ్య, అనూష దంపతులు, పర్వతనేని ప్రభాకర్ గంగా వరలక్ష్మి దంపతులు, ఆలయ డైరెక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 3వ తేదీన శ్రీ పాటమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం ఆవరణలో నిప్పుల గుండం, 4వ తేదీన అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

దెందులూరులో శ్రమకాల ప్రార్థనలు

దెందులూరు: శ్రమకాల ప్రార్థనలు దేవునికి మరింత దగ్గర చేరుస్తాయని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ జి అమ్మన్ రాజా ఆధ్వర్యంలో శ్రమలకాల ప్రార్థనలు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికార్ జనరల్ మాట్లాడుతూ తపస్కాల దీక్షలు స్వీకరించిన దీక్షాధారులు ఆధ్యాత్మిక చింతన, సేవాభావం కలిగి ఉండాలన్నారు. అనంతరం ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

టీడీపీ నేతలకు దళితులంటే చులకన

కామవరపుకోట: తెలుగుదేశం పార్టీ నాయకులు మొదట నుంచి దళితులను చులకన భావంతోనే చూస్తారని జలపవారిగూడెం గ్రామానికి చెందిన దళిత నాయకులు కరుటూరి బాలస్వామి, కరుటూరి మిథున్ చక్రవర్తి, మరికొందరు దళిత నాయకులు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో దళితులకు సరైన మనుగడ, గుర్తింపు ఉండదని, ఎన్నికల సమయంలోవాడుకుని అధికారంలోకి వచ్చాక వదిలేస్తారని, దళితులను జెండా మోసే కూలీలుగానే గుర్తిస్తారు తప్ప వారికి ఆ పార్టీలో సరైన గౌరవం లభించదని వాపోయారు. అందుకనే టీడీపీలో ఇమడలేక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసి ఇటీవల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర పార్టీ కార్యాలయం తాడేపల్లిలో కలిసి, ఆయన ఎదుట తమ గోడును వెల్లబుచ్చినట్లు వారు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

ఉంగుటూరు: ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థులు ఈనెల 7వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరం తరగతులకు మంగళవారం నుంచి హాజరుకావాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ తదితర కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఈనెల 23 వరకు బ్రిడ్జికోర్సు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉంగుటూరు తహసీల్దార్‌గా రవికుమార్

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దార్‌గా అమరావతి సెక్రటరీయేట్‌లో పనిచేస్తున్న పాలపర్తి రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల ముందు రెగ్యులర్ తహసీల్దార్లు బదిలీలు కాగా ఆ తరువాత నుంచి పూర్తిస్థాయి తహసీల్దార్ లేక డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన డీటీ పూర్ణచంద్రప్రసాద్ నూతన తహసీల్దార్ రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు.

2, 3 తేదీల్లో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

దెందులూరు: మండలంలో స్వయం ఉపాధి పథకం కింద వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 2, 3 తేదీల్లో ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. దరఖాస్తు చేసిన లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

ఎత్తు తగ్గించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మించాలి

బుట్టాయగూడెం: ఎత్తు తగ్గించకుండా పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ శత వార్షికోత్సవం సందర్భంగా గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న జీప్ యాత్ర సోమవారం బుట్టాయగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్అండ్ఆర్ ప్యాకేజీతోపాటు అన్ని సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే గిరిజనులు పోడు భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఆ భూములకు పట్టాలిప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, సీపీఎం మండల నాయకులు బేతి కిషోర్, కుంచె వసంతరావు, సురేంద్ర, శివ, సూర్యచంద్రం, గంగరాజు, సింగారమ్మ, మోహన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

యర్రంపేటలో ప్రచార జాత యాత్ర

కొయ్యలగూడెం: సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత యాత్ర సోమవారం యర్రంపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, పట్టణాలలో రెండు సెంట్లు భూమి, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమిని పేదలకు అందజేయాలన్నారు. మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతి కుమార్, నాగం అచ్యుత్, లక్క లక్ష్మణ రావు, ఎస్కే బాజీ, రాంబాబు, మట్ట రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి కృష్ణ చైతన్య